క్లుప్తంగా

కళ్లకు గంతలతో నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని సమగ్రశిక్షా ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరింది. కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సిబ్బంది తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, మల్లేశ్, రమాదేవి, ధర్మయ్య, ఆనంద్ రావు, లత, లక్ష్మి, రాజు, రవీందర్, సోను తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలలో ముగ్గుల పోటీలు


ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ముదిగంటి సూర్యమ్మ బీఈడీ కళాశాలలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు, వాటి విలువలను తెలిపే ఉద్దేశంతో ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఆనంద్ రావు, శంకర్, సుజాత, ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

జంగుబాయి ఆలయం పరిశీలన


ఆలయాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

కెరమెరి: మండలంలోని మహజ్‌గూడ అటవీ ప్రాంతంలో బుధవారం నుంచి ప్రారంభం కానున్న జంగుబాయి ఆలయ ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ ప్రాంగణంతో పాటు రోడ్డు రవాణా సౌకర్యాలపై ఆరా తీశారు. దారిలో ఉండే రాళ్లురప్పలను తొలగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సలాం శ్యాం రావు, కమిటీ సభ్యులు కొడప జాకు, మండాడి జాకు, కొడప నగేశ్, పుర్క భాస్కర్ ఉన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత మల్లంపల్లి


బహుమతులు అందజేస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ గ్రామంలో భీమా కోరేగావ్ విజయ్ దివస్ సందర్భంగా అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ ముగిసింది. విజేతగా మంచిర్యాల జిల్లాలోని మల్లంపల్లి, రన్నరప్‌గా జిల్లెడ జట్లు నిలిచాయి. గెలుపొందిన జట్లకు ఆదివాసీ గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధుకర్ బహుమతులు అందజేశారు. నాయకులు సతీశ్, భాస్కర్, బండి మహేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బెజ్జూర్: మండలంలోని సిద్దాపూర్ గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పేకాట స్థావరంపై సోమవారం రాత్రి దాడులు జరిపినట్లు పేర్కొన్నారు. రూ.6,400 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కొనుగోళ్లు నిలిపివేత

ఆసిఫాబాద్‌అర్బన్: సాధారణ సెలవులు, పత్తి గింజల నిల్వలు పెరిగినందున ఆసిఫాబాద్, వాంకిడి, కొండపల్లి (రెబ్బెన), సిర్పూర్, కౌటాల జిన్నింగ్ మిల్లుల్లో బుధవారం నుంచి 5వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని సూచించారు. ఈనెల 6నుంచి కొనుగోళ్లు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

దుమ్ముతో అవస్థలు!

- రోడ్లపై లేస్తున్న దుమ్ము, ధూళి
- పొంచి ఉన్న శ్వాసకోశ వ్యాధులు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు


కౌటాలలో రోడ్డుపై లేస్తున్న దుమ్ము

కౌటాల: మండల కేంద్రంలో వాహనాలు వెళ్తున్నప్పుడల్లా దుమ్ము, ధూళితో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు నిత్యం రోడ్డుపై, చెత్త లేకుండా శుభ్రం చేస్తూ ఉంటే మరోపక్క భవనాలు నిర్మించే వారు ప్రధాన రహదారిపైనే ఇసుక, కంకర, మొరం కుప్పలు వేస్తున్నారు. దీంతో వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము లేస్తోంది.

నిలిచిన రోడ్డు పనులు..

మండల కేంద్రం నుంచి గుడ్లబోరి వరకు గతేడాది అసెంబ్లీ ఎన్నికలకు ముందు గుత్తేదారు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రోడ్డుకు కంకర వేసి రోజులు గడుస్తున్నా తారు వేయలేదు. అలాగే దుమ్ము లేవకుండా గుత్తేదారులు రోడ్డుపై నీరు పట్టాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో వాహనాలు వెళ్లిన ప్రతీసారి భారీగా దుమ్ము లేస్తోంది. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కంకరపై నుంచి ద్విచక్ర వాహనాలు నడిపేందుకు వాహనదారులు ముప్పుతిప్పలు పడుతున్నారు. తరుచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

దుమ్ముకు నిలయం..

కౌటాలలోని పలువురు రహదారికి ఇరువైపుల ఉన్న తమ భవనాల ఎదుట మొరం, మట్టి వేసి ఎత్తు చేస్తున్నారు. దీంతో వర్షాలకు రహదారికి ఇరువైపుల ఉన్న మట్టి రోడ్డు మధ్యకి చేరడంతో వాహనాలు వచ్చి పోయేటప్పుడు భారీ ఎత్తున దుమ్ము లేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలను సైతం గుర్తించలేనంత దట్టంగా దుమ్ము కమ్ముకుంటోంది. ముఖ్యంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్, కుమురం భీం చౌరస్తా, మార్కెట్ ఏరియా, తలోడి చౌరస్తాలో దుమ్ముతో ద్విచక్ర వాహన చోదకుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లు, వాహనాలు, చెట్లు దుమ్ముమయంగా మారుతున్నాయి. స్థానిక ప్రజలు కళ్లు, ముక్కులో మంట, దగ్గు సమస్యలతో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏటా ప్రమాదాలు

కౌటాల ప్రధాన రహదారిపై నుంచి నిత్యం వందల సంఖ్యలో అధిక లోడుతో వెళ్లే కంకర లారీలతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గుంతలు పడుతున్నాయి. గుంతలకు మరమ్మతులు చేస్తున్నా.. ప్రతీరోజు భారీ వాహనాలు ఎక్కువ సంఖ్యలో వెళ్తుండటంతో దుమ్ము, ధూళి భారీగా లేస్తోంది. భారీ వాహనాలతో చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డు పైకి రావడానికి జంకుతున్నారు. అధిక లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్లు నిర్లక్ష్యంగా, ఇష్టారాజ్యంగా లారీలను అతివేగంగా నడుపుతుండడంతో ద్విచక్ర వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పలుమార్లు లారీల్లో నుంచి కంకర రోడ్డుపై పడుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. లారీలు కేవలం రాత్రి సమయంలో మాత్రమే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

రిటైర్డ్ కార్మికులకు ఘన సన్మానం


జ్ఞాపిక అందజేస్తున్న పీవో

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో మంగళవారం పదవీ విరమణ పొందిన పలువురు కార్మికులను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఓసీపీలో ఫోర్‌మెన్ కందుల కొమురయ్య, ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్‌గా విధులు నిర్వహించే జంగపెల్లి వెంకటి, కన్వేయర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించే కటకం శంకర్, జనరల్ మజ్దూర్ కొత్తపెల్లి రామన్న దంపతులను ఓసీపీ ప్రాజెక్టు అధికారి నరేందర్‌తో పాటు గని అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు, తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు. పీవో మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులు వారి శేషజీవితాన్ని సుఖసంతోషాలతో గడపాలన్నారు. టర్మినల్ బెనిఫిట్స్‌ను జాగ్రత్తగా, పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషశయనరావు, చంద్రశేఖర్, దివాకర్, వర్క్‌మెన్ ఇన్స్‌పెక్టర్ నరేశ్, నాయకులు ఓదెలు, రాజయ్య, నరేశ్, కోటి, దిలీప్, తిరుపతి, ధర్మయ్య, రమేశ్, సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన అధికారికి సన్మానం

బెల్లంపల్లి ఏరియా ఇంజనీరుగా పని చేసి మంగళవారం పదవీ విరమణ పొందుతున్న భీంరావు జాడేను మంగళవారం ఐఎన్‌టీయూసీ నాయకులు సన్మానించారు. చివరి పనిదినం సందర్భంగా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గల ఏరియా ఇంజినీరు కార్యాలయంలో ఆయనను ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఏరియా ఇంజినీర్‌గా ఏరియాకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావు, జీఎం కార్యాలయ ఫిట్ కార్యదర్శి భీమేశ్, నాయకులు శ్రీనివాస్, పల్లాస్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి


షఫీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నిబంధనలు అతిక్రమిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లను గుర్తించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ షఫీకి వినతి పత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, నాయకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టైగర్ కారిడార్ పేరుతో ఇబ్బంది పెట్టొద్దు


మాట్లాడుతున్న కొండా రాంప్రసాద్

బెజ్జూర్: అటవీ అధికారులు టైగర్ కారిడార్ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్, సమన్వయకర్త కొండా రాంప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రిజర్వ్ ఫారెస్ట్ భూముల పేరుతో రైతుల భూములను సాగు చేయకుండా అడ్డుపడుతున్నారన్నారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా ఊరుకునేది లేదని, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మండల సీనియర్ నాయకులు ఖాజా, మండల యూత్ కన్వీనర్ దుర్గం తిరుపతి, నికాడే మోహన్, బాబు, పాపనపేట గ్రామ ఉపాధ్యక్షుడు ఆత్రం వెంకటేశ్, శ్రీకాంత్, బాబురావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన డీటీ


కల్లెగాంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీటీ

కెరమెరి: మండలంలోని కొత్తగూడ కల్లెగాం, కల్లెగాంలోని ప్రాథమిక పాఠశాలలను మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్ తనిఖీ చేశారు. వంట గదుల్లో శుభ్రత పాటించాలని, తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. విద్యార్థులకు వడ్డించే ముందు ఉపాధ్యాయులు రుచి చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం తయారు చేసి ఇవ్వాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట చహకటి శ్యాంరావు, హెచ్ఎం నైతం నారాయణ తదితరులు ఉన్నారు.

ఆదివాసీ అభివృద్ధికి సమష్టి కృషి చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్: ఆదివాసీ సమాజాభివృద్ధికి సమష్టి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గోండ్వానా పంచాయతీ రాయ్‌సెంటర్ రాజ్‌గోండ్ సేవాసమితి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లాలో గిరిజన గ్రామాల్లో టైగర్ కారిడార్‌తో ఏర్పడే ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. విద్యాపరంగా ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, గిరిజన గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లేందుకు రాయిసెంటర్‌లు కీలకమన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సిడాం అర్జుమాస్టర్, మోతీరాం, పెందుర్తి సుధాకర్, నరసింగరావు, జ్ఞానేశ్వర్, యశ్వంత్ రావు, శంకర్, భీమ్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా కొలవార్ జెండావిష్కరణ


జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

చింతలమానెపల్లి: ఈనెల 8న ఆదివాసీ ఆత్మగౌరవ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆదివాసీ కొలవార్(మన్నెవార్) సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జెండా ఆవిష్కరణ నిర్వహించారు. 8న బుధవారం అన్ని గ్రామాలలో భీమదేవర జెండా పండుగ నిర్వహించనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గాట్ల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల ప్రసాద్, నాయకులు పనేందర్, వెంకన్న, ఎడ్ల శంకర్, మడె బాపురావు పాల్గొన్నారు.


కౌటాల బేకరీలో వివిధ రకాల కేకులు

కొత్త ఏడాది సందడి..!

- న్యూ ఇయర్ వేడుకల్లో యువత
- విక్రయానికి సిద్ధంగా కేక్‌లు, రంగులు

ఆసిఫాబాద్/ ఆసిఫాబాద్‌అర్బన్/ కౌటాల: జిల్లా కేంద్రంతో పాటు కౌటాల మండలంలో నూతన సంవత్సర వేడుకల సందడి మొదలైంది. 2024కి వీడ్కోలు పలికి.. 2025కి స్వాగతం పలికారు. బేకరీ వ్యాపారులు వివిధ రకాల కేక్‌లు తయారు చేసి విక్రయించారు. గిఫ్ట్ గ్యాలరీల నిర్వాహకులు ఇప్పటికే పలు రకాల గిఫ్ట్‌లు తీసుకురాగా, బుక్ సెంటర్ల నిర్వాహకులు క్యాలెండర్లు, డైరీలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు.

రకరకాల కేక్‌ల తయారీ..

నూతన సంవత్సరం వేడుకలకు వివిధ రకాల కేక్‌లను మండల కేంద్రంలోని బేకరీ నిర్వాహకులు సిద్ధం చేశారు. కూల్ కేక్, చాక్లెట్ కేక్, ఇతర రకాల కేక్‌లతో పాటు సాధారణ కేక్‌లను విక్రయానికి సిద్ధంగా ఉంచారు. మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా, ఆర్టీసీ బస్టాండ్, కాలజీ ఏరియాలోని బేకరీల్లో కేక్‌లను అందుబాటులో ఉంచారు. సాధారణ కేక్ రూ. 200 కేజీగా, కూల్ కేక్ కేజీ రూ. 400గా అమ్ముతున్నారు. న్యూ ఇయర్ సందర్భంగా ఆయా బేకరీల వద్ద షమీనాలు ఏర్పాటు చేసి వందల కేక్‌లను విక్రయిస్తున్నారు. కేక్‌లపై డిస్కౌంట్లు సైతం ఇస్తున్నారు.

రంగుల కొనుగోలు..

కౌటాల మండలవాసులు, యువకులు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు రకాల గ్రీటింగ్ కార్డులు, గిఫ్ట్‌లను ఆయా జనరల్ స్టోర్లలో అందుబాటులో ఉంచారు. కౌటాల మండల కేంద్రంలో మంగళవారం న్యూ ఇయర్ వేడుకల సందడి కనిపించింది. పలువురు నూతన వస్త్రాలు కొనుగోలు చేశారు. యువతులు వివిధ రకాల అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. దీంతో మండల కేంద్రం రద్దీగా కనిపించింది. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రంగులను కొనుగోలు చేశారు. ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.





ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని స్వీట్‌హౌజ్‌ల ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లు

అక్రమంగా తరలిస్తున్న దేశీదారు పట్టివేత


పట్టుకున్న దేశీదారు బాటిళ్లు చూపుతున్న సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: మహారాష్ట్ర నుంచి అక్రమంగా కాగజ్‌నగర్‌కు తరలిస్తున్న దేశీదారును మంగళవారం రాత్రి రెబ్బెన పోలీసులు మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద పట్టుకున్నారు. రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్సై డి.చంద్రశేఖర్‌లు తెలిపిన వివరాల ప్రకారం డిసెంబర్ 31 సందర్భంగా మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కాగజ్‌నగర్‌కు చెందిన రాజశేఖర్ గౌడ్‌తో పాటు డ్రైవర్ సురేశ్‌లు కారులో మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ వెళ్తున్నారు. అనుమానం వచ్చి కారును ఆపి తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 1800 దేశీదారు 90ఎంఎల్ బాటిళ్లు లభ్యమైనట్లు వారు తెలిపారు. వెంటనే కారుతో పాటు దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 61,200 ఉంటుందని, ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరం


అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో

కెరమెరి: వన్యప్రాణుల వేట చట్ట రీత్యా నేరమని ఎఫ్ఆర్‌వో మజారోద్దీన్ అన్నారు. మండలంలోని మహరాజ్‌గూడ అటవీ ప్రాంతంలో ఉన్న జంగుబాయి ఆలయ ప్రాంగణంలో ఆదివాసీలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అడవుల రక్షణ, పర్యావరణ ముప్పు, అటవీ జంతువుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు ఎన్ని ఎకరాలు ఉంటే అంతవరకే సాగుచేయాలని, అధికంగా సాగు చేస్తే పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అడవుల్లో విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడ కూడదన్నారు. బీట్ అధికారులు రామయ్య ఉన్నారు.